క్లుప్తంగా

ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాలి

నర్సీపట్నం : గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాలని ఆదివాసి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ధనార్జన్, ధర్మరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసి దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని అబిద్‌సెంటర్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గిరిజనుల న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఏజన్సీ ముఖద్వారమైన నర్సీపట్నంలో గిరిజన భవనం నిర్మాణానికి స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జాజిగెడ్డ ఆక్రమణల పరిశీలన



రిజర్వాయర్ ఆక్రమణలు పరిశీలిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

మాకవరపాలెం : జాజిగెడ్డ రిజర్వాయర్ ఆక్రమణలను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. మండలంలోని పాపయ్యపాలెంలో ఉన్న జాజిగెడ్డ రిజర్వాయర్ ఆక్రమణలకు గురైందని రైతులు ఇటీవల తహసీల్దార్ వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణల కారణంగా రిజర్వాయర్ గర్భం కుదించుకుపోతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శనివారం తహసీల్దార్‌తో పాటు ఇరిగేషన్ అధికారులు ఈ రిజర్వాయర్ ఆక్రమణలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రికార్డుల ప్రకారం రిజర్వాయర్ గర్భాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి ఆక్రమణలు తొలగిస్తామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

ఆలస్యంగా వరి నాట్లు

మాడుగుల: గత రెండు రోజులు నుండి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ముమ్మరంగా వరి నాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ వరినాట్లు ఆలస్యం అవడంతో దిగుబడులు అంతగా రావని రైతులు చెబుతున్నారు. గత ఏడాది జూలై నెలాఖరునాటికి పూర్తయ్యాయి. కానీ ఈ ఏడాది ఆగస్టు రెండోవారం దాటిపోతున్నాసరే వరి నాట్లు పూర్తి కాలేదని వరినారులు ముదిరిపోయాయని దిగుబడులు రావని రైతులు చెబుతున్నారు. వ్యవసాయాధికారులు సూచనలు, సలహాలు అందజేయాలని మండల రైతులు కోరుతున్నారు.

సంతోషిమాత ఆలయంలో కుంకుమపూజలు



సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు

కె.కోటపాడు : చౌడువాడలో గల గవరపేటలో సంతోషిమాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం రాత్రి సామూహిక కుంకుమపూజలు జరిపారు. శ్రావణమాసం మూడో శుక్రవారం పర్వదినం కావడం వల్ల మహిళలతో కుంకుమ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించినట్టు ఆలయ అర్చకులు దార్లపూడి సాయిరాం శర్మ తెలిపారు. కుంకుమ పూజల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్షాబంధన్



ఎస్ఎఫ్ఐ నాయకులకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

నర్సీపట్నం : సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో విద్యార్థినులతో రక్షాబంధన్ కార్యక్రమం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. విద్యార్థుల సమస్యలపై నిరంతరం అండగా నిలుస్తున్న ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి మోహన్‌సాయిలకు విద్యార్థినులు రాఖీలు కట్టి సోదరి భావాన్ని చాటుకున్నారు. సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలు, మహిళలకు రక్షణ ఉండడం లేదన్నారు. ఎన్ని చట్టాలు చేసినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఆడపిల్లకు, మహిళలకు అందరం అండగా ఉండాలన్నారు. ఆడపిల్లల రక్షణకు ఎస్ఎఫ్ఐ అండగా ఉంటుందన్నారు.

మలుపుల మాటున ప్రమాద ఘంటికలు..

- హెచ్చరిక బోర్డులు శూన్యం
- రేడియం స్టిక్కర్లు సైతం ఏర్పాటుచేయని ఆర్అండ్‌బీ
- రెప్పపాటులో చోటు చేసుకుంటున్న ప్రమాదాలు



పాము మెలికలను తలపిస్తున్న చోడవరం-గవరవరం రోడ్డు

చోడవరం : అసలే గోతులు...ఆపై పాము లాంటి మలుపుల రోడ్లతో నిత్యం ప్రజలకు ప్రాణసంకటమే. ఈ రోడ్లలో ప్రయాణం చేయడమంటే క్షణక్షణం ప్రమాదపు అంచునకు వెళ్లి రావడమేనన్నట్టుగా ఉన్నాయి. వీటికి తోటు కనీసం హెచ్చరిక బోర్డులు, స్టిక్కరింగ్ లేకపోవడం వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. చోడవరం నుంచి విశాఖపట్నం, అనకాపల్లి, నర్సీపట్నం, దేవరాపల్లి, పి.ఎస్.పేట, చీడికాడ మార్గాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారులు ఉన్నాయి. ఈ రోడ్లలో తరుచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గ్రామీణ రహదారులు కావడం వల్ల అన్ని రోడ్లు పాములను తలపించే విధంగా మెలికలతో ఉంటాయి. చోడవరం వయా గవరవరం , దేవరాపల్లి రోడ్డు, చోడవరం -చీడికాడ రోడ్డు, చోడవరం వయా పి.ఎస్.పేట, బెన్నవోలు రోడ్లులో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రోడ్లు అడుగడుగునా మలుపులతో కూడినవై పాము మెలికలు తలపిస్తుంటాయి. రెప్పపాటులో ప్రమాదకరమైన మలుపులు ప్రతీ 100మీటర్ల దూరంలో ఉంటాయి. వాహనచోదకులు ఏ మాత్రం ఏమరపాటు పడ్డా క్షణాల్లో ప్రమాదం ముంచుకొచ్చేస్తుంది. గడచిన ఏడాది కాలంలో ఈ రోడ్లలో సుమారు 35ప్రమాదాలు జరగగా 11మంది మృతిచెందారు. 58మంది తీవ్రంగా గాయపడ్డారు. అనేక మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. పగటి సమయాల్లోనే ఈ రూట్లలో వాహనాలు నడపడం ప్రమాదమైతే ఇక రాత్రి సమయాల్లో చెప్పనక్కర్లేదు. వాహనాల రద్దీతో ట్రాఫిక్ కూడా ఎక్కువగా ఈ రోడ్లలో ఉంటుంది. ఇలాంటి పరిస్థితిలో ప్రమాదాలను అదుపుచేసేందుకు ఆర్అండ్‌బీ శాఖ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. రోడ్లపై పడ్డ భారీ గోతులను పూడ్చకపోగా కనీసం ప్రమాదాలను హెచ్చరించే రేడియం స్టిక్కరింగ్ ఇండికేషన్లు, హెచ్చరిక బోర్డులు సైతం ఎక్కడా ఏర్పాటు చేయలేదు. దీని వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నిత్యం వందలాది ఆటోలు, జీపులు, ద్విచక్రవాహనాలు ఈ రూట్లలో తిరుగుతుంటాయి. రాత్రి సమయాల్లో చీకట్లో మలుపులు కనిపించగా అనేక వాహనాలు పంటపొలాల్లో బోల్తాపడ్డాయి. గవరవరం రోడ్డులో ఒకే మలుపు చోట వరుసగా రెండు బైక్‌లు ప్రమాదాలకు గురై ఇద్దరు మృతిచెందిన సంఘటనలు ఈ మలుపురోడ్లతో ప్రమాదాన్ని చెప్పకనే చెబుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిచడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల నివారణకు ఆర్అండ్‌బీ, పోలీసు, ఆర్టీఏ అధికారులు మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మలుపుల వద్ద ఇబ్బందులు

గవరవరం మలుపుల రోడ్డు చాలా భయంగా ఉంటుంది. రెప్పవేస్తే పంట కాలువల్లో పడిపోతాం. ఇలాంటి ప్రమాదకరమైన రోడ్డులో రేడియం స్టిక్కరింగ్ లేకపోవడంతో ఒక్కసారిగా మలుపును గమనించక నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు.

– కె.రమణ, ఆటోడ్రైవర్, గవరవరం

ప్రమాదాలు నివారించాలి

చోడవరం–వయా మాడుగుల ఘాట్‌రోడ్డు, పాడేరు రోడ్డులో పూర్తిస్థాయిలో హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కరింగ్ ఏర్పాటు చేయలేదు. దీనివల్ల రాత్రి సమయాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

–సురేష్ బాబు, జీపుడ్రైవర్, చోడవరం

వైభవంగా నగర సంకీర్తన వార్షికోత్సవం



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం : నగర సంకీర్తన వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా రెండో శనివారం తామరంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు నగర సంకీర్తన చేస్తుంటారు. ఈ కార్యక్రమం ప్రారంభించి 13 ఏళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం మండల కేంద్రంలోని బస్టాండు నుంచి తామరంలో ఉన్న ఆలయం వరకు నగర సంకీర్తన చేశారు. భక్తులు వెంకటేశుని గీతాలు ఆలపించుకుంటూ వెళ్లి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం భారీ ఎత్తున భక్తులకు కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రభాకరరాజు, రఘుబాబు, నారాయణరావు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్, తాతారావులను సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ తాతారావు, ఎమ్మెల్యేలు బండారు, పంచకర్ల

కె.కోటపాడు : జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ద్వారా రైతులకు అన్ని రకాలైన వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలను అందించేందుకు సిద్ధంగా ఉందని డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు అన్నారు. చౌడువాడ పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి శనివారం ఆయన చౌడువాడకు విచ్చేశారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ ఖరీఫ్ , రబీ కాలాల్లో రైతులకు విత్తనాలు, ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచనున్నట్లు ఆయన తెలిపారు. సోసైటీ అధ్యక్షునిగా నియమితులైన రాజీ నారాయణమూర్తి, డైరక్టర్లు గొర్లి శంకరరావు, దేముడుబాబులతో ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. సోసైటీని లాభాల పాటలో పయనించేలా శక్తివంచన లేకుండా పని చేయనున్నట్లు నారాయణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్‌బాబు, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, సీఈవో బత్తిన సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పొడుగుపాలెంలో చిన్నారులకు వ్యాక్సినేషన్

కె.కోటపాడు : 0–5 ఏళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా వైద్య సిబ్బంది వేసే వ్యాక్సినేషన్‌ను వేయించాలని తల్లిదండ్రులకు లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ అన్నారు. పొడుగుపాలెం గ్రామంలో శనివారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని జరిపారు. ఈ కార్యక్రమాన్ని త్రినాథ్ పర్యవేక్షించారు. పెంటావాలెంట్, పోలియో, పీసీవీ, డీపీడీ, ఎంఆర్ వ్యాక్సిన్‌లను 12 మంది చిన్నారులకు వేశారు. గర్భిణులకు ధనుర్వాతం రాకుండా టీటీ వ్యాక్సిన్‌ను వేశారు.

ప్రజాక్షేమం కోసం ఆలయాల్లో పూజలు



గొలుగొండలో భక్తులు ప్రజల క్షేమం కోసం ర్యాలీగా తిరుగుతున్న దృశ్యం

గొలుగొండ : ప్రజలు సంతోషం కోసం గ్రామస్తులు అంతా ఐక్యంగా శనివారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ఈ గ్రామ ప్రజలు అన్ని కుటుంబాల్లో సంతోషాలు కలిగే విదంగా వేద పండితులతో ప్రత్యేక పూజలు చేయడం జరిగింది. గొలుగొండ గ్రామంలో సుమారుగా 4వేలకు పైగా అన్ని కులాలకు చెందిన వారు జీవించడం జరుగుతుంది. అయితే ఇటీవల కొన్ని కుటుంబాల్లో ఇబ్బందులు రావడంతో గ్రామ పెద్దలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరిగింది. గ్రామంలో ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండే విదంగా వేద పండితులతో హోమాలు, ప్రత్యేక పూజలు చేయించాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగా గ్రామంలో అన్ని కులాలకు చెందిన వారు కమిటీలు వేసి కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం పెద్ద ఎత్తున శాంతియుత హోమాలు నిర్వహించారు. ఏ కుటుంబంలో ఇబ్బందులు లేకుండా పూజా కార్యక్రమాలు చేసారు. గొలుగొండలో ఉన్న అన్ని దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజల్లో పాల్గొన్నారు. సుమారుగా 4వేల మంది గ్రామస్తులు స్థానిక రామాలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.

గిరిజనుల హక్కుల కోసం ఆందోళన



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బండి గంగరాజు

నాతవరం : రాజ్యాంగంలో గిరిజనులకు కల్పించిన హక్కులను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బండి గంగరాజు అన్నారు. ఆయన శనివారం ప్రపంచ ఆదివాసీల దినోత్సవం సందర్భంగా సరుగుడు పంచాయతీ శివారు రామన్నపాలెం గ్రామంలో గిరిజన సంక్షేమ హైస్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదాన ప్రాంతంలో నివాసం ఉంటున్న గిరిజనులకు అన్ని విధాలుగా అన్యాయం జరుగుతుందన్నారు. పాడేరు ఐటీడీఏ ద్వారా అనేక సంక్షేమ పథకాలు మైదాన ప్రాంత గిరిజనులకు అందించేవారన్నారు. 1/70 యాక్టు పరిధిలో గిరిజనులు నిబంధనల ప్రకారం ఎలాంటి పనులు జరగడం లేదన్నారు. ఆదివాసీల దినోత్సవాలు చేయడం తప్ప చంద్రబాబు ప్రభుత్వంలో గిరిజనులకు ఎలాంటి మేలు జరగదన్నారు. మైదాన ప్రాంత గిరిజనులకు ఐటీడీఏ పరిధిలో వారికి అందించే ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఘనంగా గణపతి ఆలయ ప్రారంభోత్సవం



గణపతిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నక్కపల్లి: మండలంలో తమ్మయ్యపేటలో నూతనంగా నిర్మించిన గణపతి ఆలయ ప్రారంభోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య గణపతి హోమం, మండప ఆరాధన, గణపతి పూజ వంటి కార్యక్రమాలు జరిగాయి. తమ్మయ్యపేట, చందనాడ, తుమ్మలపేట తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వీసం రామకృష్ణ, చందనాడ సర్పంచ్ తళ్ల రోహిణీ భార్గవ్, ఎంపీటీసీ గంటా తిరుపతిరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కే వెంకటేష్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమం జరిగింది.

కుండపోత వర్షంతో హర్షం



చెరువును తలపిస్తున్న కోటవురట్ల మెయిన్‌రోడ్డు

కోటవురట్ల: మండలంలో శనివారం కుండపోత వర్షం కురిసింది. తెల్లవారు జామున సుమారు రెండు గంటల పాటు దంచి కొట్టగా మళ్లీ సాయంత్రం మరోసారి ఎడాపెడా కురిసింది. రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తుపాకుల గెడ్డలోకి చాలా కాలానికి జలకళ చేరింది. ఎప్పటిలానే మండల పరిషత్ కార్యాలయం ఎదుట భారీగా వర్షం నీరు నిలిచిపోయి చెరువును తలపించింది. రోడ్డు నిండిపోవడంతో పాటు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోకి ప్రవహించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పాదచారులు నడిచే దారిలేక అవస్థలు పడ్డారు. మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. చాలా కాలంగా ఇక్కడ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండలవాసులు మండిపడుతున్నారు. కనీసం ప్రజా ప్రతినిధులు కూడా దృష్టి సారించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి జన్మించిన శ్రావణ నక్షత్రం పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా స్వామివారికి వజ్ర కవచాలంకృతులతోపాటు వివిధ రకాల పూలు, తులసీ మాలలతో అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ప్రసాద వితరణ చేశారు. అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించారు. స్థానిక గవరపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాస్ పూజా కార్యక్రమాలు జరిపారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



మాడుగులలో సోదరునికి రాఖీ కడుతున్న సోదరీమణులు



బేతపూడి కేజీబీవీలో విద్యార్థినులకు రాఖీ కడుతున్న సోదరులు



తమ్ముడికి రాఖీ కడుతున్న సోదరి



మాడుగుల రూరల్ : ఘాట్‌రోడ్డులో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క



వడ్డాదిలో తమ్ముళ్లకు రాఖీ కడుతున్న అక్క



పీడీ పాలెంలో సత్తిబాబుకు హెల్మెట్,రెయిన్ కోట్,టోపీ అందిస్తున్న సోదరి వెంకటలక్ష్మి

నాతవరం : మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకలు శనివారం ఘనంగా జరుపుకొన్నారు, రక్షబంధంలో భాగంగా అక్కా చెల్లమ్మలు అన్నదమ్ములకు రాఖీ కట్టి అనుబంధాన్ని చాటుకున్నారు. సోదరీమణులు సంతోషంగా ఉండాలంటూ దీవించి స్వీట్లు పంచుకోని సందడి చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానింగా ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మాడుగుల: మండలంలో వాడవాడలా రక్షా భంధనం వేడుకలు ఘనంగా శనివారం జరుపుకొన్నారు. దూర ప్రాంతాల్లోని అన్న దమ్ములకు స్వీట్స్ రాఖీ తీసుకుని వెళ్లి రాఖీ తట్టి తమ అనుబంధం, మమకారం చాటుకున్నారు.

దేవరాపల్లి: బేతపూడి కేజీబీవీలో స్థానిక విద్యార్థినులకు సుదూర ప్రాంతాల నుంచి అన్నదమ్ములు వచ్చి రాఖీ కట్టించుకున్నారు. రాఖీ కట్టిన అనంతరం స్వీట్లు తినిపించారు. తెనుగుపూడిలోని డా. బీబీఆర్. అంబేద్కర్ బాలుర గురుకుల విద్యాలయం, దేవరాపల్లి బీసీ వసతి గృహ విద్యార్థులకు సైతం సోదరీమణులు వచ్చి రాఖీలు కట్టి సందడి చేశారు.

రావికమతం : అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముడు అనురాగానికి గుర్తుగా జరుపుకొనే రాఖీ పండుగను చిన్నా, పెద్ద,కులమతాలు భేదం లేకుండా నిర్వహించారు. ఉదయం నుంచే ఆడపడుచులతో గ్రామాల్లో సందడి నెలకొంది. నువ్వు నాకు రక్ష...నేను నీకు రక్ష అంటూ అప్యాయ పలకరింపులతో రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు.

బుచ్చెయ్యపేట : అన్నాచెల్లెల అనురాగ పండగైన రాఖీ పండగ రోజు పొట్టిదొరపాలెంకు చెందిన వెంకటలక్ష్మి తన అన్నకు రాఖీ కట్టడమే కాక తన అన్న బైక్‌పై వెళ్లేటపుడు ఎటువంటి ప్రమాదాల భారిన పడకూడదని వర్షం వస్తే తడవకుండా ఉండాలని హెల్మెంట్,రెయిన్ కోట్,టోపీ అందించి అన్నకు రాఖీ శుభాకాంక్షలు తెలిపింది. బుచ్చెయ్యపేట మండలంలో పలు గ్రామాల్లో అన్నదమ్ములకు అక్కచెల్లెలు రాఖీ కట్టి స్వీట్లు పంచిపెట్టికుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపికున్నారు. ఆయా గ్రామాల్లో నాయకులకు పలువురు రాఖీలు కట్టారు.

అనకాపల్లిలో 1.8 మి.మీ వర్షపాతం



మారేడుపూడి రహదారిలో వర్షం

అనకాపల్లి: పట్టణ, మండలంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం శనివారం కురిసింది. మూడు రోజులుగా 35 నుంచి 37.0 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృత మై వర్షం పడటంతో వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు. ఈ మేరకు 1.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా విభాగం వాతావరణ శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

కశింకోట: శనివారం మధ్యాహ్నం కశింకోటలో గాలితోపాటు వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. రెండు రోజుల క్రితం భారీ వర్షం కురిసింది. దీంతోపాటు ఇప్పుడు వర్షం కురవడంతో ఎండిపోతున్న వరి నారుమళ్లకు ఉపకరిస్తుందని రైతులు తెలిపారు.

హైవేపై వర్షపునీటితో ప్రమాదాలు



జాతీయ రహదారిపై ప్రమాదకరంగా నిలిచిపోయిన వర్షపు నీరు

తుమ్మపాల: మండలంలో శంకరం బొజ్జన్నకొండ జంక్షన్ వద్ద అనకాపల్లి – ఆనందపురం జాతీయ రహదారిపై వర్షపు నీటి ప్రవాహంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్డుపై ఇరువైపులా వర్షపునీరు ఏరులై పారింది. సబ్బవరం నుంచి అనకాపల్లి వైపు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు నీటిలో అదుపు తప్పి గాయాల పాలయ్యారు. క్షతగాత్రులైన వృద్ధ దంపతులను వెనుక నుంచి వస్తున్న మరో వాహనంలో ప్రయాణికులు ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారి విస్తరణలో శంకరం పరిసర ప్రాంతాల్లో వర్షపు నీటి ప్రవాహానికి సరైన కల్వర్టులు ఏర్పాటు చేయలేదు. దీంతోపాటు కాలువలు ఆక్రమణకు గురికావడంతో నీరంతా రోడ్డుపై నిలిచిపోతోంది. దాంతో అనేక ప్రమాదాలు ఇక్కడ చోటు చేసుకోవడంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని, ప్రమాదాల నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

పెరుగుబజార్ రోడ్డు విస్తరణ ప్రారంభం



రోడ్డు విస్తరణ పనుల ప్రారంభ కార్యక్రమంలో కూటమి నాయకులు

అనకాపల్లి టౌన్: సుమారు ఏడాదిన్నర తర్వాత పట్టణంలోని పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు రోడ్డు పనులు ఎట్టకేలకు పునః ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డు విస్తరణపై వైఎస్సార్‌సీపీ, ప్రజా సంఘాల పోరాటాలతోపాటు పలుమార్లు పత్రికలలో కథనాలు రావడంతో కూటమి నాయకుల్లో కదలిక వచ్చింది. శనివారం పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఎంతో రద్దీగా ఉండే ఈ రహదారి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విస్తరణ చేపట్టారు. తదనంతరం ఎన్నికలు రావడంతో విస్తరణ పనులకు బ్రేక్ పడింది. రోడ్డు విస్తరణలో భవనాలు కోల్పోయిన 94 మందికి టీడీఆర్‌లు ఇవ్వగా, మిగిలిన 40 మందికి ఇంకా ఇవ్వలేదు. దీంతో విస్తరణ పనులు ఆలస్యమయ్యాయి. తాజాగా రహదారి పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, నీలబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.